నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

## చరిత్ర సృష్టించిన మహానుభావుడు ఎన్టీఆర్



కోటగిరిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ పోచారం

### బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి/ నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించేందుకు పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటగిరిలోని మిర్జాపూర్‌క్యాంప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనాడు ఢిల్లీలో తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడంతో ఎన్టీఆర్ చలించిపోయారని గుర్తుచేశారు. తాను ఇన్నాళ్లూ పదవులు పొందడం ఎన్టీఆర్ పెట్టిన భిక్ష అని పేర్కొన్నారు. టీడీపీకి ఏమాత్రం సంబంధం లేనివారు కూడా నేడు రాజకీయ స్వార్థం కోసం గొప్పలు చెప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**శివాజీ విగ్రహావిష్కరణ..**

బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## గీత దాటితే వేటే..

### పదిన్నర తర్వాత తెరిచి ఉంటే పర్మినెంట్‌గా క్లోజ్

### సీపీ కల్మేశ్వర్ హెచ్చరిక...



వినాయకనగర్, ఫిబ్రవరి 26: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోరాత్రి 10.30 గంటల తరువాత తెరిచి ఉన్న వ్యాపార సముదాయాలను శాశ్వతంగా మూసివేయిస్తామని సీపీ కల్మేశ్వర్ హెచ్చరించారు. నిర్ణీత సమయం పాటించకుండా కొందరు వ్యాపారులు అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా తెరిచి ఉంచుతున్నట్లు తమ పరిశీలనలో వెలుగుచూసినట్లు తెలిపారు.అర్ధరాత్రి వరకు వ్యాపార సముదాయాలను తెరిచి ఉంచడంతో అవి నేరాలు చేసే వ్యక్తులకు అడ్డాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. రాత్రి 10.30 గంటల లోపు వ్యాపార సముదాయాలు మూసివేయాలని, ఇందుకోసం ప్రత్యేకఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారం రోజులుగా జిల్లా పోలీస్ శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టగా.. నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఐదు షాపుల పై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరు యజమానులకు నాలుగు రోజుల జైలు శిక్ష పడిందని తెలిపారు.



ఇసన్నపల్లిలో ఎండిపోయిన పొలం

# యాసంగి సాగేదెల!

నెర్రెలు బారుతున్న నేల

పంట పొలాలకు అందని సాగునీరు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వలు..
- అడ్డగోలుగా విద్యుత్ కోతలు
- వట్టిపోతున్న బోరుబావులు
- ఆందోళనలో జిల్లా రైతులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 26 : వేసవి రాకముందే ఎండలు ముదురుతుండడంతో కామారెడ్డి జిల్లాలో నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోతుండగా..రోజురోజుకూ భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. దీంతో పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు తగ్గడంతోపాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం,చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో యాసంగి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టుల నుంచి సరిపడా నీళ్లు వదలకపోవడం, కాలువలు, చెక్‌డ్యామ్‌లను నింపకపోవడంతో వరి, మక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటలు వేసిన రైతులు ఈసారి దిగుబడిపై నమ్మకం లేదని, పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని చాలా గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్నాయి. దీంతో పంటలు పండకపోతే తీవ్రంగా నష్టపోయి, తమ బతుకులు ఆగమవుతాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**జిల్లాలో ఖాళీ అవుతున్న చెరువులు..**

కామారెడ్డి జిల్లాలోని ప్రధాన చెరువులు ఎండిపోతున్నాయి. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని రామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి మండల్లాలోని చాలా చెరువులు నీరులేక వెలవెలబోతున్నాయి. జిల్లాలో వంద ఎకరాల కన్నా ఎక్కువగా సాగునీరు అందించే చెరువులు 194 ఉన్నాయి. వీటి ద్వారా 46 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. వంద ఎకరాల కన్నా తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 1056 ఉండగా, వీటి కింద 39 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. వానకాలంలో వర్షాలు తక్కువగా కురవడం, సెప్టెంబర్ తరువాత వర్షాల జాడ లేకపోవడంతో చెరువులు ఖాళీగా కనిపిస్తున్నాయి. మరోసారి వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులు యాసంగి పంటలు వేశారు. చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతుండడంతో పంటలు ఎండి పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పంటల దిగుబడిపై ఆశలు వదులుకుంటున్నారు. రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి, కన్నాపూర్, రామారెడ్డి శివారులో ఉన్న చింతల కుంట చెరువు, కొచ్చెరువు, రంగ చెరువు, పటేల్ చెరువుల్లో నీరు ఇంకి పోవడంతో రైతులకు సాగునీరు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో వరి పంట పొలాలు నెర్రెలు బారుతున్నాయి.

**కరెంట్ కోతలు..అందని జలాలు**

గాంధారి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వాపూర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో నాలుగు రోజుల క్రితం నాలుగు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరారం, సీతాయిపల్లి, మొండిసడక్, ముదెల్లి, చెన్నాపూర్ తదితర గ్రామాల్లో బోరు బావుల్లో నీటి ఊట తగ్గడం, కరెంటు సరిగా లేకపోవడంతో పంటలకు అవసరమైనంత సాగునీరు అందడంలేదని రైతులు చెబుతున్నారు. వేసవికి ముందే ఇబ్బందులు తలెత్తితే, మరో రెండు నెలల పాటు సాగునీరు ఎలాఇస్తారని ఆందోళన చెందుతున్నారు.

**నీళ్లు లేక పంట ఎండుతున్నది..**

"చెరువులో నీటి నిల్వలు ఉన్నాయని రెండెకరాల్లో వరిపంట వేశాను. కానీ చెరువులో నీరు ఎండిపోతున్నది. దీంతో పంటకు నీరు అందకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఎకరానికి రూ.16 వేల పెట్టుబడి పెట్టాను. చెరువు కిందనే బోరు వేసినప్పటికీ అదీ వట్టిపోతున్నది. చెరువులో నీరులేక, బోరుబావి నుంచి నీళ్లు రాక ఇప్పుడు పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది."

**- దోమకొండ శ్యాంరావు, ఇసన్నపల్లి, రామారెడ్డి**



## పోలియో చుక్కలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 26 : జిల్లాలో మార్చి 3న నిర్వహించనున్నపల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఏదైనా కారణంతో 3వ తేదీన పోలియో చుక్కలు వేయించుకోలేని వారికి ప్రత్యేక బృందాలు 4,5 వ తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తారని చెప్పారు. జిల్లాలో ఐదేండ్లలోపు చిన్నారులు సుమారు 1,02,555 మంది ఉన్నారని,వారందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బోధన్‌లో 'ఆర్వోబీ' పనులకు శంకుస్థాపన

### వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ఆర్వోబీ పనుల ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, ఫిబ్రవరి 26: పట్టణంలో బోధన్ – జాన్కంపేట్ రైల్వేలైన్‌లో గాంధీ పార్కు వద్ద ఉన్న రైల్వేక్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో సోమవారం శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని, పనులకు సంబంధించిన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఆర్వోబీని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల నిరసన .. కార్యక్రమం బహిష్కరణ**

బోధన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపనకు వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన జర్నలిస్టులకు కనీసం కుర్చీలు ఏర్పాటుచేయకపోవడమేకాకుండా, అమర్యాదకరంగా వ్యవహరించడంతో ఈ కార్యక్రమాన్ని జర్నలిస్టుల బహిష్కరించారు. అనంతరం రైల్వే క్రాసింగ్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లు

## అంగన్‌వాడీ హెల్పర్ల ధర్నా

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 26: పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ హెల్పర్ల నియామకాలు చేపట్టి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.రమేశ్ బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, దేవగంగు మాట్లాడారు. అంగన్‌వాడీ ప్రమోషన్ సౌకర్యాన్ని కల్పించేందుకు విద్యార్హతను ఇంటర్‌కు మార్చారని, దీంతో అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న హెల్పర్లకు నష్టం జరిగే అవకాశమున్నదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని పాత పద్ధతుల్లో నియామకాలు చేపట్టాలని కోరారు. మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను, సమ్మెకాలంలో 24రోజుల వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.స్వర్ణ, కోశాధికారి చంద్రకళ, ఉపాధ్యక్షురాలు మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన పంటలను పరిశీలించిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



దుబ్బాకలో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ధర్పల్లి/ సిరికొండ, ఫిబ్రవరి 26: సాగు నీరందక ఎండిపోతున్న పంటలపై నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో వ్యవసాయ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ధర్పల్లి మండలంలోని దుబ్బాక, రేకులపల్లి, సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామాల్లో ఎండిన పంటలను ఏడీఏ ప్రదీప్ వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలకు నీరందక ఎండిపోయినది వాస్తవమేనని, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లలో నీరు రాక పంటలు ఎండిపోయాయన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. వారి వెంట ఏఈవో మనోజ్, రైతులు ఉన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి మార్చి 16 వరకు పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 54,855 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల ఏర్పాటు, 144 సెక్షన్ అమలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 54,855 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే విద్యార్థుల హాల్‌టికెట్లను విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ మొత్తం సీసీ కెమెరాల నిఘాలోనే జరగనున్నది. ఈసారి కూడా నిమిషం నిబంధన అమలు చేస్తున్నారు.

– కామారెడ్డి/ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 26



ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో కలెక్టర్లతోపాటు నోడల్ అధికారులు సమావేశాలు నిర్వహించారు. పరీక్షా సెం టర్ల వద్ద విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, రవాణా, కరెంటు సౌకర్యాలపై అన్నిశాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డి జిల్లాలో 19,509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరానికి 9,993 మంది, ద్వితీయ సంవత్సరంలో 9,516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, మొత్తం 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి పట్టణంలో 12 సెంటర్లను ఏర్పాటు చేయగా, అందులో మూడు ప్రభుత్వ, తొమ్మిది ప్రైవేట్ క ళాశాలల్లో ఏర్పాటు చేశారు. 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. జీపీఆర్‌ఎస్ ద్వారా మూడు సెట్లను పోలీస్ స్టేషన్లలో భద్రపరచనున్నారు. ఐదుగురు కస్టోడియన్స్, 750 మందికి పైగా ఇన్విజిలేటర్లను నియమించనున్నారు.

**నిజామాబాద్‌లో..**

జిల్లాలో మొత్తం 35,346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ 14,965, వొకేషనల్ 2,399, ద్వితీయ సంవత్సరం జనరల్ 13,986, ప్రైవేట్ 1804, వొకేషనల్ రెగ్యులర్ 1999, ప్రైవేట్ 193 మంది పరీక్షలు రాయనున్నారు.

**నిమిషం నిబంధన అమలు..**

పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8.15 నుంచి 9 గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైన వారికి అనుమతించబోమని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు సమీపంలో జిరాక్సు సెంటర్లను మూసివేయనున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, అందుబాటులో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తారు.

**అంతా సీసీ కెమెరా నిఘాలోనే...**

ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాల్లో బోర్డు అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా ఎదుటే ప్రశ్నపత్రాలను విడుదల చేయడం, సమాధాన పత్రాలను సీల్ చేయడం వంటివి కొనసాగుతాయి. పరీక్షలకు మూడు,నాలుగు రోజులుగా ముందుగా సమీప పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను సరఫరా చేసే బాధ్యత కస్టోడియన్లకు అప్పగిస్తారు. పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు సెంటర్ లొకేటర్ యాప్‌ను రూపొందించారు. హాల్‌టికెట్ నమోదు చేస్తే విద్యార్థి ఉన్న ప్రదేశం నుంచి పరీక్షా కేంద్రం ఎంత దూరంలో ఉన్నది.. అక్కడికి ఎలా చేరుకోవాలనేది ఈ యాప్ ద్వారా సులభంగా తెలుసుకునే అవకాశం ఉన్నది.

### గంట ముందే చేరుకోవాలి



ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలోకి అనుమతించబోం. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి.

**-షేక్ సలాం, ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి, కామారెడ్డి**

## ఆటోను ఢీకొట్టి.. వాహనాన్ని వదిలేసి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో, కారు

రుద్రూర్, ఫిబ్రవరి 26: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కాన్వాయిలోని ఓ కారు ఆటోని ఢీకొనగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఆటో డ్రైవర్‌ను 108 అంబులెన్సులో దవాఖానకు తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. కోటగిరిలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉండడంతో..ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తన కాన్వాయితో బోధన్ నుంచి రుద్రూర్ వైపు వెళ్లారు. రుద్రూర్ గ్రామశివారులో ఎమ్మెల్యే కాన్వాయిలోని ఓ వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసంకాగా డ్రైవర్ షేక్ ముబిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాన్సువాడ మండలం కొత్తాబాది గ్రామానికి చెందిన షేక్ ముబీన్ కాలు, చేయి విరిగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రదేశంలోనే ఎమ్మెల్యే కాన్వాయిలోని వాహనాన్ని వదిలేసి వెళ్లిపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆటోను అజాగ్రత్తగా నడిపి కారును ఢీకొట్టాడంటూ కారు డ్రైవర్ భూక్యా సతీశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వ్యవసాయ కళాశాల మంజూరుకు కృషి చేస్తా..

కోటగిరి ఫిబ్రవరి 26 : జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. కోటగిరిలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు.. విడుదల**

కోటగిరి మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ నేతలు ఎజాజ్‌ఖాన్, పత్తి లక్ష్మణ్ మండిపడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చేయాలనే ఆలోచనలో ఉండగా, అరెస్టు చేసిన వారిని పోలీసులు విడుదల చేశారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల